క్లుప్తంగా

భూములను పరిశీలించిన ఆర్డీవో

ముద్దనూరు : మండలంలోని మంగపట్నం, ఉప్పలూరు, చిన్నదుద్యాల గ్రామాల పరిధిలో ల్యాండ్ కన్వర్షన్‌కు సంబంధించిన భూములను ఆర్డీవో సాయిశ్రీ మంగళవారం పరిశీలించారు. స్థానిక తహసీల్దారు వరదకిషోర్‌రెడ్డితో కలసి ఆమె మూడు గ్రామాల్లో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయడానికి అవసరమైన భూములను పరిశీలించారు. ల్యాండ్ కన్వర్షన్, ఎన్‌వోసీ అనుమతులకోసం ఈ భూములను పరిశీలించినట్లు తహసీల్దారు తెలిపారు. పలువురు సిబ్బంది ఈ పరిశీలనలో పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు గ్రంథాలయాలు వాటి ఉపయోగాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాలర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, లైబ్రేరియన్ ఇబ్రహీం పాల్గొన్నారు

వర్షంతో దెబ్బతిన్న వరి పంట

జమ్మలమడుగు : ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరి పంట అకాల వర్షాలకు దెబ్బతింది. మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి కోత దశలో ఉన్న వరి పంట నేలకొరిగింది. దీంతో వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి మండల పరిధిలోని ధర్మపురం, దేవగుడి, గొరిగేనూరు గ్రామాలలో సాగు చేసిన వరి పంటను మంగళవారం పరిశీలించి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు మండలంలో 2600 ఎకరాలలో వరి పంట సాగుచేశారని ప్రస్తుతం కురిసిన వర్షానికి వరిపంటలో నీరు నిలిచిందన్నారు. ఈ నీటిని రైతులు బయటికి పంపించాలని సూచించారు. ఆరు గ్రామాల్లో 450 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా వేశామన్నారు. నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

అనాథలకు దుప్పట్లు పంపిణీ


అనాథ వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

పులివెందుల టౌన్ : శ్రీభగవాన్ సత్యసాయిబాబా 99వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పాత మార్కెట్ సాయిబాబా ఆలయంలో మంగళవారం 99 మంది అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సమితి మహిళా మండలి అనాథ వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. అలాగే సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీ మిట్టమల్లేశ్వర దేవస్థానంలో మంగళవారం మధ్యాహ్నం అయ్యప్ప భక్తులకు రియల్ ఎస్టేట్ వ్యాపారి కోమెర హరినాథ్ భిక్ష ఏర్పాటు చేశారు. అయ్యప్ప భక్తమండలి ఆధ్వర్యంలో వేద పండితులు అతనిని అభినందించారు. కార్యక్రమంలో హరినాథ్ కుటుంబ సభ్యులు అయ్యప్ప భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధృవకుమార్‌రెడ్డి ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అనిల్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వాక్యానుసారం ఎదగాలి

కమలాపురం : మీ ప్రేమ, ఆప్యాయత, అనురాగం మరువలేనిదని, ప్రతి ఒక్కరు వాక్యానుసారం ఎదగాలని రాయలసీమ డయాసిస్ బిషప్ రెవ. పి. ఐజాక్ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక సీఎస్ఐ చర్చీ ఫాస్టర్, సంఘ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన నాల్గవ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. సంఘ సభ్యుడు నీరుగట్టు శీనయ్య తన తండ్రి అబ్రహాం, సోదరుని కుమారుడు అరుణ్‌బాబు జ్ఞాపకార్థం చర్చి ఆవరణంలో నిర్మించిన వంటశాలను ప్రారంభించారు. అనంతరం సంఘ పెద్దలు భక్తులకు సందేశం అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో సంఘ సభ్యులు, పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు


డ్రాయింగ్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

సింహాద్రిపురం : స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం గ్రంథాలయ అధికారి శేఖర్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రభుత్వ ఉన్నత, వివేకానంద పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సంక్షోభం

- మౌలిక సదుపాయాలు కరువు
- కనిపించని సీసీ కెమెరాలు
- తరగతి గదిలోనే దర్శనమిస్తున్న బట్టలు, బకెట్లు



పులివెందుల : తరగతి గదిలో దర్శనమిస్తున్న విద్యార్థుల బట్టలు, బక్కెట్లు

పులివెందుల రూరల్ : పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు సమీపంలోని శేషాద్రి బిల్డింగ్‌లో ఉన్న గురుకుల పాఠశాలలో సంక్షోభం నెలకొంది. గురుకుల పాఠశాలలో సుమారు 2500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారికి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. 200 మంది విద్యార్థులకు గానూ.. కేవలం 15 మరుగుదొడ్లు మాత్రమే ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గదులు కూడా అపరిశుభ్రంగా ఉండటంతో ఎక్కడ చూసినా చెత్తా చెదారాలే దర్శనమిస్తున్నాయి. చదువుకునే తరగతి గదిలోనే బకెట్లు, బట్టలు, పెట్టుకునే పెట్టెలు, వస్తువులు కనిపిస్తున్నాయి.

ఇరుకుగా ఉన్న మరుగుదొడ్లు, స్నానపు గదులు : పట్టణంలోని గురుకుల పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థులు గానూ.. 16 మరుగుదొడ్ల గదులు ఉండటంతోపాటు స్నానాలు చేయాలంటే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురుకుల పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరగతి గదులకు కిటికీలు, తలుపులు కూడా పగిలిపోయి ఉన్నాయి. సంక్షేమ వసతి గృహాలలో కనీస వసతులు కూడా లేకపోవడంతో విద్యార్థులు దిక్కుతోచని పరిస్థితుల్లో విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల కూడా అద్దె భవనాల్లో కొనసాగుతోంది. ప్రతినెలా సుమారు రూ.90వేల అద్దె చెల్లిస్తున్నారు. కనీస సౌకర్యాలు కల్పించడంలో సంబంధిత అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. భోజనం కూడా అంతంతమాత్రంగానే ఉండటంతో విద్యార్థులు అన్నం తినలేక పడేస్తున్నారు. అలాగే చాలా వసతి గృహాలలో సీసీ కెమెరాలు ఎక్కడ కనిపించడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధ్వానంగా హాస్టల్ మరుగుదొడ్లు

వేముల : స్థానిక ఎస్సీ హాస్టల్‌లో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. మరుగుదొడ్లకు ఉన్న పైపులు పగిలిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కిటికీలు అక్కడక్కడ దెబ్బతినడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో దోమలు విపరీతంగా ఉంటాయని విద్యార్థులు అంటున్నారు. గత 5 నెలలుగా నిధులు మంజూరు కావడంలేదని వార్డెన్ ప్రభాకర్ తెలిపారు. కాగా యూసీఐఎల్‌కు చెందిన సీఎస్ఆర్ నిధులతో హాస్టల్‌లో మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు పంపామని. నిధులు మంజూరు కాగానే మరమ్మతు పనులు చేస్తామని వార్డెన్ తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు అందని దుప్పట్లు

లింగాల : స్థానిక ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి దుప్పట్లు అందలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చలికాలం ముంచుకొస్తోందని విద్యా సంవత్సరం ఆరు నెలలు పూర్తయినా దుప్పట్లు అందలేదని విద్యార్థులు అంటున్నారు. అలాగే బీసీ హాస్టల్‌లో అక్కడక్కడ అపరిశుభ్రత చోటు చేసుకుంది. బాత్రూం తలుపు విరిగిపోవడంతో దాన్ని పక్కనపెట్టి వినియోగించుకునే పరిస్థితి నెలకొంది. అపరిశుభ్రతతో దోమల బెడద తీవ్రమవుతోంది.


పులివెందుల పట్టణంలో అద్దె గదులలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాల

హాస్టల్‌లో విద్యార్థులకు అవస్థలు

వేంపల్లె : వేంపల్లి- పులివెందుల రోడ్డు కుప్పాలపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న ఉర్దూ గురుకుల పాఠశాల హాస్టల్‌లో సరైన వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. చలికాలం కావడంతో రాత్రి సమయంలో దుప్పట్లు లేక దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం హాస్టళ్లలో ఉన్న విద్యార్థులకు దుప్పట్లు, మౌలిక వసతులు కల్పించకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాత్రూంలో సరిగా నీరు రాకపోవడంతో బయటకి వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. అలాగే బీసీ బాలికల హాస్టల్‌లో సరైన మౌలిక వసతులు లేకపోవడంతో చాలామంది విద్యార్థులు టీసీలు తీసుకుని బయట ఊర్లకు వెళ్లిపోతున్నారు. ఈ రెండు హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు.


వేముల : పగిలిపోయిన మరుగుదొడ్లకు ఉన్న పైపులు


లింగాల : విరిగిన బాత్రూం తలుపు


లింగాల : హాస్టల్ భవనం పక్కనే అపరిశుభ్రత

అయ్యప్పస్వామి భక్తులకు క్షమాపణ చెప్పాలి

వేంపల్లె : అయ్యప్ప మాల ధరించి కడప దర్గాకు వెళ్లిన సినీ హీరో రామ్‌చరణ్ అయ్యప్ప భక్తులకు, హిందువులకు క్షమాపణలు చెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఓ పక్క రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని చెబుతూ జాతీయ వాదాన్ని ముందుకు తీసుకెళుతుంటే మీరు ఇలా అయ్యప్ప మాల ధరించి దర్గాకు వెళ్లి హిందువుల మనోభావాలు దెబ్బతీయడం సమంజసమా అని ప్రశ్నించారు. హిందూ సమాజంలో లేని కొత్త సంప్రదాయలను సృష్టించవద్దని అయన రామ్‌చరణ్‌కు సూచించారు.

ఇంటి స్థలాలు దక్కే వరకు పోరాటం చేస్తాం


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కమలాపురం : అర్హులైన పేద ప్రజలందరికీ ఇంటి స్థలాలు దక్కే వరకు పోరాటం చేస్తామని సీపీఐ ఏరియా కార్యదర్శి పి.చంద్రశేఖర్, ఏరియా సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అర్హులైన ప్రతి పేద ప్రజలకు ఇంటి స్థలాలు దక్కే వరకు పోరాటం చేస్తామన్నారు. గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థలంలో ఇళ్లు నిర్మించి ఇస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. అర్హులైన పేద ప్రజలను గుర్తించి తక్షణం ఇళ్లు మంజూరు చేయాలని వారు కోరారు.

రబీలో 8 రకాల పంటలకు బీమా చేసుకోవచ్చు



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీ ప్రభాకర్‌రెడ్డి

వేముల : రబీ సీజన్‌లో సాగు చేసిన 8 రకాల పంటలకు బీమా చేసుకోవచ్చునని వ్యవసాయ శాఖ ఏడీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వేల్పులలోని రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఓ రాఘవేంద్రారెడ్డి, ఏడీఏ ప్రభాకర్‌రెడ్డిలు హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన అరటి పంటలో సిగటోకా, ఆకు మచ్చ తెగులు ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. దీంతో అరటిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా విధి విధానాలను విడుదల చేసింది. ఈ రబీ సీజన్‌లో 8 రకాల పంటలకు బీమా సౌకర్యం చేసుకునే వీలుందన్నారు. రైతులందరూ సాగు చేసిన పంటలకు పంటల బీమా ప్రీమియాన్ని మీసేవ కేంద్రంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రబీ వేరుశనగ సాగుకు విత్తనాలు మంజూరు


శనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ చెన్నారెడ్డి, తదితరులు

వేముల : రబీలో బోర్ల కింద వేరుశనగ సాగు చేసే రైతులకు సబ్సిడీపై వేరుశనగ కాయలు అందించనున్నట్లు వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి తెలిపారు. మంగళవారం శనగపంట క్షేత్ర సందర్శనలో భాగంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ కాయలు కావలసిన రైతులు రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ అసిస్టెంట్‌ను కలిసి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని తెలిపారు. వేరుశనగ కాయలు పూర్తి ధర క్వింటాలుకు రూ.9600 కాగా.. అందులో 40 శాతం సబ్సిడీ పోనూ క్వింటా రూ.3850లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రేపటి నుంచి అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. శనగ పంటలో అక్కడక్కడ వేరుకుళ్ళు తెగులు ఆశించిందని, దీని నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ ఒక లీటర్ నీటికి మూడు గ్రాములు లేదా ఫాలిక్యూర్ ఒక లీటర్ నీటికి ఒక ఎంఎల్ కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అసిస్టెంట్ సాయిప్రసన్న, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

తొండూరు : పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బోడివారిపల్లె, బూచుపల్లె, భద్రంపల్లె గ్రామాల్లోని పొలాలను ఆయన సంర్శించారు. ఈ సందర్భంగా శనగపంటకు ఆశించిన ఎండు తెగులు గమనించి వాటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆయన రైతులకు సూచించారు. అలాగే రైతులకు రబీ పంటల బీమా గురించి వివరించారు. శనగ గ్రామ యూనిట్, పెసర జిల్లా యూనిట్, మినుము, వేరుశనగ, నువ్వులు, జొన్న, పొద్దుతిరుగుడు, వరి పంటలను మండల యూనిట్‌గా తీసుకుని పీఎం ఫసల్ బీమా యోజన పంటల బీమాకు వచ్చేనెల 15వ వరకు గడువు ఉందన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

కమలాపురం : పంటలు సాగు చేయడానికి 24 గంటల ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని డీడీఏ రమణారెడ్డి తెలిపారు. మంగళవారం నల్లింగాయపల్లె, తురకపల్లె గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది... కార్యక్రమానికి ఆయన హాజరై పలు రకాల పంటలను పరిశీలించి మాట్లాడారు. లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు వాడాలన్నారు. మండల ఏఓ సరస్వతి మాట్లాడుతూ బ్యాంకు ద్వారా రుణాలు పొందిన రైతుల బీమా ప్రీమియంను బ్యాంకుల ద్వారానే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సైంటిస్ట్ మాధురి, ఏఓ పద్మజ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీలలో పాల్గొన్న విద్యార్థినులు

వేముల : స్థానిక గ్రంథాలయంలో మంగళవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి గంగాధర యాదవ్ మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఉక్కు మహిళ అని, ఆమె భారతదేశానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆమె చిత్ర పటానికి నివాళులర్పించారు. టీచర్లు మమత, భార్గవి, గంగా భవాని, పాఠకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి


కమలాపురంలో ఆధార్ మొబైల్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జ్యోతి

కమలాపురం : ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. మంగళవారం కమలాపురం 4వ వార్డు సచివాయలంలో జరుగుతున్న ఆధార్ క్యాంప్‌ను ఆమె పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు అపార్ కార్డు చేస్తున్న నేపథ్యంలో ఆధార్ కార్డు మొబైల్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. పేర్లలో తప్పులున్నా, చిరునామా మార్పు తదితర వివరాలను సరి చేసుకోవచ్చునని ఆమె తెలిపారు. 22వ తేదీ వరకు ఆధార్ సేవలు 3, 4వ వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండల పరిధిలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంప్‌లలో ఆధార్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు. మంగళవారం పలు గ్రామాలలోని సచివాలయాలలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్‌లను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆధార్ క్యాంప్ ఈ నెల 29వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు.

డిజిటల్ సేవలు సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న ఏపీజీబీ సీనియర్ మేనేజర్ శ్రీధర్

వేముల : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ డిజిటల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీబీ సీనియర్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. మండలంలోని ఎద్దులయేని గ్రామంలో మంగళవారం పులివెందుల ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఆర్థిక సాంకేతిక అక్షరాస్యత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీజీబీలో అన్ని డిజిటల్ సేవలు అందుబాటులో ఉన్నాయని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలు ఉన్నాయన్నారు. ఏ బ్యాంకు ఖాతాదారుడైన మా బ్యాంకు వ్యాపార ప్రతినిధి వద్ద ఆధార్ కార్డుతో ఆర్థిక లావాదేవీలు జరుపుకునే అవకాశం ఉందన్నారు. టర్మ్ డిపాజిట్లపై తమ బ్యాంకు అధిక వడ్డీ ఇస్తోందన్నారు. బ్యాంకులో అన్ని రకముల రుణ సౌకర్యం కలదని, వ్యవసాయ, డెయిరీ, ఎడ్యుకేషన్, వాహన, హౌసింగ్ రుణాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ కిశోర్‌కుమార్ రెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీతో వేరుశనగ విత్తనాలు పంపిణీ


విత్తనాన్ని పరిశీలిస్తున్న కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి

వీరపునాయునిపల్లె : వేరుశనగ పంట సాగు చేయు రైతులకు 40 శాతం రాయితీతో విత్తనాన్ని అందిస్తున్నట్లు కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కొమ్మద్ది రైతు సేవా కేంద్రంలో విత్తన పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలోని 15 రైతు సేవా కేంద్రాల పరిధిలోని 93 మంది రైతులు 83.4 క్వింటాళ్ల విత్తనం నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. కె6 మరియు టి.సి.జి.ఎస్ 1694 రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, వ్యవసాయ సహాకులు, రైతులు పాల్గొన్నారు.

పర్యవేక్షణలేని మధ్యాహ్న భోజనం


నాణ్యత లోపించిన అన్నం

ముద్దనూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యత, పర్యవేక్షణ లోపించిందని దీనికి తగిన చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, కార్యదర్శి లింగమయ్యలు ఆరోపించారు. మంగళవారం వారు మధ్యహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం లేదని దీంతో పాటు అన్నం నాణ్యత లోపించిందని, విద్యార్థులు భోజనం చేసే సమయంలో ఉపాధ్యాయులు ఎవరూ పర్యవేక్షించలేదన్నారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని మధ్యాహ్న భోజనం అమలు సక్రమంగా చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థులకు చిత్ర లేఖన పోటీలు


చిత్రలేఖన పోటీల విద్యార్థులతో అధ్యాపకులు

వేంపల్లె : స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో గ్రంథాలయ రూపు రేఖలపైన చిత్రలేఖన పోటీలను విద్యార్థులకు నిర్వహించామని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయ శాఖ అధిపతి పి.మాధవరావు మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్య, ప్రతిభ పాటవాలను ప్రదర్శించారన్నారు. ఈ పోటీలలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున అందిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభించకపోతే ఉద్యమం తప్పదు




పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

జమ్మలమడుగు : నియోజకవర్గంలో ఉక్కు ఫ్యాక్టరీ పనులు ప్రభుత్వం ప్రారంభించకపోతే ఉద్యమం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి రామమోహన్ తెలిపారు. మంగళవారం పట్టణంలో సీపీఎం పట్టణ మూడవ మహాసభలను ఆయన ప్రారంభించి అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణం శిలాఫలకాలకే పరిమితమై పోతున్నాయన్నారు. ఎన్నికల ముందు పాలకులు ఫ్యాక్టరీ పనులు ప్రారంభిస్తామని హామీలు చెబుతున్నారేతప్ప ఇంత వరకు అతిగతి లేదన్నారు. రానున్న కాలంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. గండికోట ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలకు పరిహారం చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని పరిహారం బాధితులకు వెంటనే చెల్లించాలన్నారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు మనోహర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి


వల్లూరులో గ్రీన్ అంబాసిడర్లను సన్మానిస్తున్న ఎంపీడీవో రఘురాం


సీకేదిన్నెలో గ్రీన్ అంబాసిడర్లను సత్కరిస్తున్న ఎంపీడీఓ, ప్రజాప్రతినిధులు

వల్లూరు : ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్యానికి సరైన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అసరం వుందని ఎంపీడీవో రఘురాం తెలిపారు. వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా మండలంలోని వల్లూరు, లేబాక గ్రామ సచివాలయాల్లో మంగళవారం ర్యాలీలను నిర్వహించారు. అనంతరం సమావేశాలను నిర్వహించారు. వల్లూరులో జరిగిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాల న్నారు. బహిరంగ మల విసర్జన అనేక వ్యాధుల వ్యాప్తికి దోహదం చేస్తుందన్నారు. టాయిలెట్లను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వుపయోగించాలన్నారు. టాయిలెట్ల నిర్వహణ గురించి వివరించారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఎంఆర్‌సీ నాగమణి పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు సన్మానం

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండలం బుసిరెడ్డిపల్లి సచివాలయంలో ప్రపంచ టాయిలెట్ దినోత్సవం సందర్భంగా గ్రామ పరిధిలోని గ్రీన్ అంబాసిడర్లను ఎంపీడీవో కుల్లాయి బాబు సన్మానించారు. పారిశుద్ధ్య నిర్వహణలో గ్రీన్ అంబాసిడర్ల పాత్ర గణనీయమైనదన్నారు. అనంతరం వారిని సన్మానించి, బియ్యం ప్యాకెట్‌తో పాటు నిత్యవసర సరుకులు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వెంకటరెడ్డి, ఈఓపీఆర్డీ వెంకటసుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు సన్మానం

ముద్దనూరు : ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం పారిశుధ్య కార్మికులను ఎంపీడీవో ముకుందరెడ్డి సన్మానించారు. మండలంలోని నల్లబల్లె గ్రామ సచివాలయంలో గ్రీన్ అంబాసిడర్‌లు రామసుబ్బమ్మ, సుబ్బరాయుడులను సన్మానించారు. పారిశుధ్య కార్మికుల పనిచేయడం వలనే పరిసరాలు పరిశుభ్రంగా వున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు రామారెడ్డి, కార్యదర్శి అనిల్‌కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.